ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి





నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

రామాపురం కాల్పుల ఘటనలో
నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం సర్కిల్ పరిధిలో బత్తలపల్లి మండలం రామాపురం వద్ద జరిగిన కాల్పుల ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ధర్మవరం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు.

బత్తలపల్లి మండలం రామాపురం బస్టాపు వద్ద ఈనెల 20వ తేదీ నకిలీ తుపాకులతో కాల్పులు జరిగాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం షికారి పాలెంకు చెందిన పొమారి బంగారి, రాణా హరిష, రాణా నూర్ ఆలియాస్ రాణా బాబు రాజ, పోమరి విలాస్ ఆలియాజ్ ఇలాచి కలిసి అసలు బంగారం ముసుగులో నకిలీ బంగారాన్ని విక్రయించడం ద్వారా ప్రజలను మోసం చేసే నేరాలకు పాల్పడే నేరస్తులు. వీరు తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా, మానసన్పల్లి గ్రామంలోని నరేశ్‌ను సంప్రదించి, నకిలీ బంగారాన్ని రూ.15 లక్షలకు విక్రయించే ఒప్పందం కుదుర్చున్నారు. అయితే షికారి పాల్యం ముఠా నకిలీ బంగారం అమ్మకం గురించి ముందుగానే తెలిసిన నరేష్ హైదరాబాదుకు చెందిన పులి అరవింద్ కుమార్ అనే వ్యక్తిని సంప్రదించి ముఠా గురించి సమాచారం ఇచ్చాడు. సైబర్ క్రైమ్ లో ఎథికల్ హ్యాకర్ అయిన అరవింద్, తన సహాయకులతో కలిసి రైడ్‌ను ప్లాన్ ద్వారా ఇలా నకిలీ బంగారం విక్రయించే ముఠాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడానికి తన 'ఎ.కె. సైబర్ న్యూస్ యూట్యూబ్' ఛానెల్లో అప్లోడ్ చేయడానికి జరిగే సంఘటనలను రికార్డ్ చేయాలని ప్లాన్ చేశాడు. ఈ మేరకు ఈనెల 20న ఉదయం 9 గంటలకు షికారిపాలెం ముఠా, పులి అరవింద్ బృందం బత్తలపల్లి మండలం రామపురం గ్రామం సమీపంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఘర్షణ జరగడంతో పులి అరవింద్ సహాయకులు వారు తీసుకువెళ్ళిన డమ్మీ పిస్టళ్లతో కాల్పులు జరపగా రెండు గ్రూపులు అక్కడి నుండి పారిపోయాయి. ఈ ఘటనకు ఉపయోగించిన బొమ్మ తుపాకులను నితీష్ రెడ్డి, జాన్వేష్ హైదరాబాద్‌లోని కోటిలో కొనుగోలు చేశారు. ఈ తుపాకులు నిజమైనవిగా కనిపించినప్పటికీ, ధ్వని ప్రభావాలను మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. ఎలాంటి ప్రాణాంతకమైన సామర్థ్యాన్ని కలిగి ఉండవు. ఘర్షణ సమయంలో బాధితులను బెదిరించడానికి వాటిని ఉపయోగించారు.

ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న శ్రీ ఎస్పీ రత్న, ధర్మవరం డిఎస్‌పి శ్రీనివాసులు పర్యవేక్షణలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌కు చెందిన 8 మంది నిందితులను , బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం 6గంటల సమయంలో అరెస్టు చేశారు. అదే విధంగా షికారి పాల్యం గ్రూపుకు చెందిన నిందితుడు హరీష్ ను అరెస్టు చేశారు.

ఈ కేసులో షికారి పాల్యం గ్రూపునకు చెందిన నిందితులు రాణా బాబు రావు అలియాస్ నూర్, పోమరి విలాస్ ఆలియాస్ ఇలాచిని అరెస్టు చేయాల్సుందని ఎస్పీ తెలిపారు. ఘటన కి పాల్పడిన వారు ఉపయోంచిన రెండు కార్లు, రెండు నకిలీ తుపాకులు, 19 నకిలీ ప్లాస్టిక్ బుల్లెట్లు, రెండు నకిలీ బంగారు పుసల చైన్లు, ఒక వాకి-టాకీ, ఒక మైకును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ధర్మవరం డిఎస్‌పి శ్రీనివాసులు, రూరల్ సిఐ ప్రభాకర్, పట్టణ సిఐలు రెడ్డప్ప, నాగేంద్ర ప్రసాద్, బత్తలపల్లి ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

అంతటా కళకళ... ఇక్కడేమో వెలవెల..!



వరదలొచ్చినా ప్రాజెక్టులు ఖాళీనే..!
తాగు, సాగునీటికి ఇక్కట్లే..

ఈ ఏడాది అంతటా వర్షాలు అధికంగా వచ్చి ప్రాజెక్టులన్నీ కళకళాడుతు ఉన్నాయి. కాని అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల్లో మాత్రం నీరు నామ మాత్రంగానే ఉండటం గమనార్హం. జిల్లాకు సాగు,తాగునీటిని అందించే నీటి వనరులు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా. ఈ రెండింటి ద్వారా వచ్చే నీళ్లే జిల్లాకు సాగు, తాగునీటిని అందిస్తాయి.. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరందించే తుంగభద్ర డ్యామ్ ఈసారి ఎప్పుడూలేని విధంగా మూడుసార్లు నిండి గేట్లు ఎత్తారు. కాని అనంతపురం జిల్లాకు మాత్రం అదనంగా నీళ్లు రాకపోగా ప్రాజెక్టులు ఖాళీగానున్నాయి. శ్రీశైలం డ్యామ్ కూడా రెండుసార్లు నిండినప్పటికీ హంద్రీనీవా ద్వారా వస్తున్న నీళ్లు నామ మాత్రమే.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాజెక్టులు వెలవెల

జిల్లాలోనున్న ప్రధాన ప్రాజెక్టులు పిఎబిఆర్, మిడ్‌పెన్నార్. ఈ రెండు ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ నిండలేదు. పిఎబిఆర్ డ్యామ్ సామర్థ్యం 11 టిఎంసిలు. అయితే నిర్మాణలోపాలతో ఐదు టిఎంసిల వరకు మాత్రమే నిలువ ఉంచుతారు. ఈ ఐదు టిఎంసిలు కూడా ఇప్పటికి రాలేదు. ఇప్పటి వరకు 2.688 టిఎంసిల నీళ్లు మాత్రమే ప్రస్తుతం నిలువ ఉన్నాయి. ప్రధాన మిడ్‌పెన్నార్ రిజర్వాయరు నిలువ సామర్థ్యం 5.170 టిఎంసిలయితే కేవలం 1.88 టిఎంసిలు మాత్రమే నీరు నిలువ ఉన్నాయి. దీని కిందనున్న చాగళ్లు బ్యాలెన్సింగు రిజర్వాయరు 1.50 టిఎంసిల నిలువ సామర్థ్యమయితే 0.850 టిఎంసిలు నిలువ ఉన్నాయి. ముచ్చుకోట రిజర్వాయరు, సుబ్బరాయసాగర్ రిజర్వాయరు ఖాళీగానే ఉన్నాయి. హంద్రీనీవా ద్వారా వచ్చే జీడిపల్లి కూడా అదే రకంగా పూర్తి సామర్థ్యంతో లేకపోవడం గమనార్హం.

ప్రధాన కాలువ నిర్వహణ లోపాలతోనే సమస్య

జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన కాలువలు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండూ నిర్వహణ లోపాలతో అధ్వాన్నంగా ఉన్నాయి. తుంగభద్ర డ్యామ్ నుంచి ఎగువప్రధాన కాలువ ద్వారా నీటిని అందించే ఈ కాలువ ద్వారా ప్రస్తుతం 1800 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాకు 13 టిఎంసిల నీరు వచ్చినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ నీళ్ల వినియోగం ఎక్కడ జరిగిందో తెలియడం లేదు. ఇప్పటికీ ప్రాజెక్టుల్లో పూర్తి సామర్థ్యంతో నీళ్ల మాత్రం రాలేదు. హంద్రీనీవా ద్వారా రావాల్సిన నీళ్లు కూడా నామ మాత్రంగానే వస్తున్నాయి. దీంతో జీడిపల్లి రిజర్వాయరు కూడా పూర్తి సామర్థ్యంతో నిండలేదు. ప్రాజెక్టులన్నీ చాలా వరకు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

ప్రాజెక్టుల నిర్వహణకు తక్షణం నిధులు విడుదల చేయాలి



రాష్ట్రమంతటా ఒకవైపు వర్షాలు ముంచెత్తిపా జిల్లాలో ప్రాజెక్టులు మాత్రం వెలవెల బోతున్నాయి. దీనికి ప్రధాన లోపం పాలకులదే. నీటిని అందించే కాలువల నిర్వహణ పూర్తి స్థాయిలో అధ్వాన్నంగా ఉన్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు బస్సుయాత్ర చేపట్టాం. ఈ యాత్రలోనూ ఈ లోపాలను పరిశీలించడమే కాకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఆచరణలో ఇప్పుడు అదే కనిపిస్తోంది. వర్షాలొచ్చినా ప్రాజెక్టుల్లో మాత్రం నీళ్ల లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. నిధులు కేటాయించాలి.

వి.రాంభూపాల్ ,
సిపిఎం జిల్లా కార్యదర్శి



పిఎబిఆర్‌లో అరకొరగా ఉన్న నీరు



హంద్రీనీవా కాలువలో తక్కువ వేగంతో వస్తున్న నీరు

నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో రెండు రోజులు లోపు నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి డిపిఒ, జిల్లా వైద్య శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్లతో, డిసిహెచ్ఒ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత వారం రోజులు పాటు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పల్లెల్లో పరిశుభ్రత అంశాలపై, సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలలో పంచాయతీ సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు, జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి పైపులు లీకేజీ జరగకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలన్నారు. వారం రోజులు పాటు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు మలేరియా, డెంగీపై జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోజుకు ఎన్ని ట్యాంకులు శుభ్రం చేస్తున్నారో ప్రతి రోజు నివేదికను అందజేయాలని డిపిఒను ఆదేశించారు. నీటి ట్యాంకులను క్లోరిన్‌తో శుభ్రం చేయాలని, ట్యాంకులు చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడ కూడా వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ శాఖ కమిషనర్లను ఆదేశించారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్, కదిరి మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా కార్యచరణ ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు, ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ధర్మవరంలో చేనేత కార్మికులు ఇళ్లలో, మగ్గం గుంతలలో నీరు చేరడంపై స్పందిస్తూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీరుని తొలగించే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అభిషేక్ కుమార్, డిపిఒ సమత, డిఎంహెచ్ఒ నాగమల్లేశ్వరి, డిసిహెచ్ఒ తిప్పేంద్రనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం పెంపొందించుకోవాలి



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ - 14 బాల, బాలికల ఫుట్ బాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుండి 520 మంది ఫుట్ బాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, కౌన్సిలర్ డిఈ రమేష్, హిందూపురం ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు జేవి అనిల్, ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, ఎంఇఒ గంగప్ప, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ మొరార్జీ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకనాథ్, ఆర్‌డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కష్ణ, ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు వేణుగోపాల్, టోర్నమెంట్ అబ్జర్వర్ అనిల్ నాయక్ క్రీడా జ్యోతిని వెలగించి క్రీడలను ప్రారంభించారు. జాతీయ క్రీడా పతాకాన్ని, ఎస్జీఎఫ్ క్రీడా పతాకాన్ని అతిథులు ఎగురవేశారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యత ప్రదర్శిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రామకృష్ణ, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు సురేష్ కుమార్, రామకృష్ణ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుగణన కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం చేపడుతున్న పశుగణనకు సంబందించిన కరపత్రాలను పశు వైద్యశాల అధికారులు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో పశు గణన జరిగినట్లుగా ఇంటికి స్టిక్కర్ అంటించే సర్వే చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం ఆయా మండలాలకు సంబంధించిన కో ఆర్డినేటర్లకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, ఎంపిడిఒ సరస్వతి, పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పెంచలయ్య, గిరిజ, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ రాధికా, టిడిపి పట్టణ అధ్యక్షులు డి ఈ రమేష్ కుమార్, ఎంఎల్ఎ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, టిడిపి నాయకులు నెట్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన సూగూరు ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న భారీ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు దాతలు విరాళం అందజేశారు. ఈడిగ ఆదిలక్ష్మమ్మ, శ్రీనివాసులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్ వైసీ చంద్ర శేఖర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

డిగ్రీ, ఇంజనీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్యకు సంబందించి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక బీసీ బాలుర వసతిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. దాదాపుగా రూ.3480 కోట్లు స్కాలర్ షిప్, ఫీ రీయింబర్స్ మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్రలో సందర్భంగా అధికారం వస్తే నెల రోజుల్లో రీయింబర్స్ మెంట్ విడుదల చేస్తామని చెప్పిన లోకేష్ దాని గురించి ఏమాత్రం మాట్లాడడం లేదన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై 1, 3, 5 సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు కట్టాలని యూనివర్సిటీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ కళాశాలలో యాజమాన్యాలు పెండింగ్ లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిళ్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న రీయంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈ నెల 28, 29, 30 తేదీలలో జిల్లా వ్యాప్తంగా తహాశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా నవంబర్ 6వ తేదీన ఛలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు చంద్రశేఖర్, మంజునాథ్, రంగనాథ్, భూతరాజు, సంతోష్, రఘు, కిరణ్, సురేష్, సుదర్శన్, తిప్పేస్వామి, వినయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, పాల్గొన్న విద్యార్థులు

అవసరం ఉన్న వారికి వినికిడి యంత్రాలు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా వినికిడి లోపం ఉన్న ప్రతి ఒక్కరికి వినికిడి యంత్రాలను అందించడానికి తాము సిద్దంగా ఉన్నట్లు దీన్ దయాల్ సొసైటీ స్టేట్ చైర్మన్ ఆర్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో దీన దయాల్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ వినికిడి లోప నిర్మూలన, నియంత్రణ కార్యక్రమం, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్తంగా వినికిడి లోప సమస్య గల పిల్లలకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని దీన్ దయాల్ సొసైటీ స్టేట్ చైర్మన్ ఆర్ రామాంజనేయులు, మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ లింగన్న, ఆర్ఎంఒ డేవిడ్ రాజు, సొసైటి జిల్లా కో ఆర్డినేటర్ పవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వినికిడి లోపం నిర్మూల కోసం తమ సొసైటి నిరంతరం శ్రమిస్తున్నదన్నారు. దీనిపై పెద్దలకు, పిల్లలకు ప్రత్యే క్యాంపు నిర్వహించి అవసరం ఉన్నా వారందరికి వినికిడి యంత్రాలను ఇవ్వడంతో పాటు శస్త్ర చికిత్స చేస్తే నయం అయ్యే వారిని ఎంపిక చేసి శస్త్ర చికిత్స చేస్తామన్నారు. అదే విధంగా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వినికిడి సమస్యల పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్ కె పోగ్రాం ఆఫీసర్ డాక్టర్. నివేదిత, ఇఎన్‌టి వైద్యులు డాక్టర్. రాజేష్, చిన్న పిల్లల వైద్యులు కీర్తి, దంత వైద్యులు డాక్టర్ అపర్ణ, ఆడియాలజిస్ట్ గీత, డిఇఐసి సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

పోలీసు వ్యవస్థపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

పోలీసు వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన అవసరమని పట్టణ సిఐ కె రాజగోపాల్ నాయుడు పేర్కొన్నారు. అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ లో విద్యార్థులకు పోలీస్ శాఖపై అవగాహన కల్పించారు. బాధితులు సమస్య పరిష్కారం కోసమై పోలీస్ స్టేషన్ కి వచ్చినప్పుడు రిసెప్షన్ సెంటర్ నుండి కేసుని ఎఫ్ఐఆర్ చేసే వరకు పోలీసులు చట్టపరంగా అనుసరించే విధానాలు, న్యాయస్థానాల ఆదేశానుసారం చేయాల్సిన విధుల గురించి వివరించారు. కొన్ని ఘటనల్లో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లలో భాగంగా లైఫ్ జాకెట్ ని వాడే విధానం, స్టోన్ గార్డ్, పోలీస్ బైక్, షీ టీమ్స్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీధర్, జయరామప్ప, ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి ఎస్. రంగనాయకులు, అధ్యాపకురాలు ఆశ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ శాఖ పనితీరు గురించి వివరిస్తున్న సిఐ

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఖురాన్ కంఠస్థం చేయడం అభినందనీయమని ఆహాలే సున్నతుల్ జమాత్ అద్యక్షులు మహాబూబ్ దౌల, అఖిల భారత టిప్పు సుల్తాన్‌యునైటెడ్‌ఫ్రంట్‌జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అన్నారు. ఖురాన్ కంఠస్థం చేసిన ఐదుగురు విద్యార్థులకు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో అరబిక్ పాఠశాల అధ్యక్షులు రహంతుల్లా సేఠ్ అధ్యక్షతన పట్టణంలోని దారుల్ ఉలూమ్ గౌసియా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ హఫీజ్ ఖురాన్ పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానాలు ఇర్ఫాన్, సాజిద్, తన్వీర్, వసీవుల్లా, అన్సారీ, ఆడిటర్ జబీవుల్లా, జామియా మసీదు కమిటీ సిరాజ్, హాజీ సుబహాన్, ఉబెదుల్లా హుసేన్, న్యాయవాది రిజ్వాన్ ఖాన్, డీసీటీవో ఇంతియాజ్ అహ్మద్, సెల్ పాయింట్ నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

28న మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28వ తేదీ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం బొగ్గు నాగరాజు అధ్యక్షతన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28వ తేదీ మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చారన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, హెల్త్ అలవెన్స్, ధర్మవరంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు, తదితర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జి.అనిల్, మహేష్, పెద్దన్న, దాసరి సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని మైదుగోళం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ రూ. 30 వేలు అందించారు. గదుల కొరతతో విద్యార్థుల తరగతుల నిర్వహణకు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 30వేలు ఇవ్వగా శుక్రవారం జయప్ప ఆ నగదు ను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ డబ్బుతో ప్రస్తుతం తాత్కాలిక అదనపు గదులు నిర్మిస్తామని ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, సర్పంచి రామచంద్రారెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ షాజు, నాయకులు మూర్తి, రామంజి, ఖలీల్, ముబారక్, ఎ.ఎస్. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి చెరువుకు జలకళ

ప్రజాశక్తి-పరిగి



మరువ మరమ్మతులను పరిశీలిస్తున్న నాయకులు

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో పాటు ఎగువన ఉన్న కర్నాటకలో కురిసిన వర్షాలకు పెద్దఎత్తున వరద నీరు చేరడంతో పరిగి చెరువు జలకళ సంతరించుకుంది. రెండేళ్ల క్రితం వరదల కారణంగా పరిగి చెరువు మరువ పారగా, ఇప్పుడు నీరు పూర్తిస్థాయిలో చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు వృథా కాకుండా ముందు జాగ్రత్తగా మంత్రి సవిత ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో చెరువు మరమ్మతులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో పరిగి చెరువు మరువ పారే అవకాశం ఉండటంతో పంచాయతీ సెక్రటరీ నారాయణ, టిడిపి నాయకులు లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, బలరాములు తదితరులు పరిశీలించారు. మరువ నుంచి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు.

విశ్వదీప్తి పాఠశాలలో రెడ్ డే



రెడ్ డే కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరిగి : మండలంలోని విశ్వదీప్తి పాఠశాలలో శుక్రవారం రెడ్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎరుపు రంగు దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. విద్యార్థులు రకరకాల ఆకృతులతో తయారుచేసిన బొమ్మలతో ప్రదర్శన నిర్వహించారు. అలాగే విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవికుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు : డిపిటిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



సమావేశంలో మాట్లాడుతున్న డిపిటిఒ మధుసూదన్

కార్తీక మాసం పురస్కరించుకొని పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. పట్టణంలోని డిపిటిఒ కార్యాలయంలో శుక్రవారం ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 52 కొత్త బస్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నూతనంగా పుట్టపర్తి నుంచి శ్రీశైలం, తిరుపతి మీదుగా చెన్నై సర్వీసును ప్రవేశపెట్టామన్నారు. హిందూపురం నుంచి నెల్లూరు మీదుగా ఒంగోలుకు సూపర్ లగ్జరీ, హిందూపురం నుంచి కళ్యాణదుర్గంకు పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బుగ్గ లింగేశ్వరం, తాడిపత్రి, యాగంటి బనగానపల్లి, మహానంది, నంద్యాల సమీపంలోని త్రిలింగ దర్శనం పుణ్యక్షేత్రాలను ఒకేరోజు దర్శించుకునే వీలుగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వివరాలకు సమీపంలో ఉన్న డిపో మేనేజర్‌ను కానీ, టికెట్ కౌంటర్‌లో గాని సంప్రదించాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎ- లెవెన్స్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రమైన సోమందేపల్లిలో 15 రోజులుగా సోమందేపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో తల టీం, ఎ లెవెన్స్ జట్టు తలపడగా ఎ లెవెన్స్ జట్టు గెలిచింది. విజేత జట్టుకు ముఖ్య అతిథులు టిడిపి హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి.హరి, టిడిపి టౌన్ అధ్యక్షులు వడ్డే సూరి బహుమతులు ప్రదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన జనసేన పార్టీ మండల కన్వీనర్ జబీవుల్లాను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసులు, రుక్మాన జ్యువెలర్స్ యజమాని షాషా, మద్దిలేటి, మనోజ్, ఆనంద్, అఖిల్ పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గుడిపల్లి పంచాయతీ గ్రామమైన వెలగమాకులపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వంక గంగమ్మ దేవాలయం పేరు మీదుగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు హాజరై రిబ్బన్ కట్ చేసి పోటీ ప్రారంభించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 36 జతల ఎడ్లబండ్లు పోటీలో పాల్గొన్నాయి. కాగా పోటీ ప్రారంభించిన కొద్దిసేపటి తర్వాత కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ఎద్దులలో బోర్లా పడటంతో రూ. 1.5 లక్షల విలువచేసే ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. నిర్వాహకులు చందాలు వసూలు చేసి బాధిత రైతుకు రూ. 80 వేలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, వెంకటేష్, రంగప్ప, రమణప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పంట బీమా విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ అనుబంధ శాఖలు, బీమా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ ఆధారిత బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటల వారీగా నిర్ణయించిన ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మీ సేవా కేంద్రం లేదా సచివాలయంలో రైతులు ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. సిసిఆర్సి కార్డుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వరి పంటకు డిసెంబర్ 31వ తేదీలోగా జొన్న, శనగ, మొక్కజొన్న, మిరప పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు బీమా ప్రీమియం చెల్లించేలా చూడాలన్నారు. అలాగే వర్షాలకు జరిగిన పంట, ఇతర నష్టాల అంచనాల జాబితాలను రెండు రోజుల్లో రూపొందించి, సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) కోసం ఆయా రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలలో వుంచి, తనకు సమర్పించాలన్నారు. వ్యవసాయ సిబ్బందికి ఆన్‌లైన్ విధానంలో నేటి నుంచి శిక్షణ తరగతులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవి.సుబ్బారావు, సిపిఒ విజయకుమార్, ఎల్‌డిఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు దాసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అపార్ ఐడిని తప్పక రిజిస్టర్ చేయాలి

పుట్టపర్తి రూరల్ : విద్యార్థులు అపార్ ఐడిని తప్పక రిజిస్టర్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకూ చదివే విద్యార్థులందరికీ తప్పకుండా అపార్ ఐడి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం తీసుకొని విద్యార్థి వివరాలను యుడిఐ సెట్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ నవంబర్ 30 తేదీ లోపు పూర్తిచేయాలన్నారు.

'తోపుదుర్తి' అక్రమాలు బయటకు తీస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి



ప్రజాదర్బార్‌లో తమ భూ సమస్యలు చెప్పుకున్న ప్రజలు

తోపుదుర్తి సోదరుల భూ మాఫియాను మొత్తం బయటకు తీస్తామని.. బాధితులకు న్యాయం చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో మహేష్ ప్రజల నుంచి వినతులు స్వీకరించగా 157 అర్జీలు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో తోపుదుర్తి భూ మాఫియా రాజ్యమేలిందన్నారు. ఎక్కువ శాతం ప్రజలు వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో అక్రమాలపై ఫిర్యాదులు చేశారన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు చెన్నేకొత్తపల్లిలో అనేక భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. ఎన్నో పంచాయతీలు చేసి భూములు కాజేశారన్నారు. భూములు ఇష్టానుసారం ఆన్‌లైన్‌లో పేర్లు మారిపోవడానికి చెన్నేకొతపల్లి-2 విఆర్‌వో మహేశ్వర్‌రెడ్డి కారణమని, అతడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

దీపావళి నుంచి 'ఉచిత గ్యాస్ సిలిండర్' : ఎమ్మెల్యే

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి టిడిపి చేపడుతున్న సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యకర్తలు, నాయకులకు ఏవైనా పదవులు రావాలంటే సభ్యత్వ నమోదు తప్పనిసరి అన్నారు. విద్యార్థులు పోలీసుల విధులు, సేవల గురించి తెలుసుకోవాలి

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విద్యార్థులు పోలీసుల విధులు, వారందించే సేవలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు స్థానిక కెజిబివిలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బాలికలకు ఆర్డీఓ మహేష్, ఎమ్మెల్యే సునీత బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు మరువ లేనివన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విధుల నిర్వహణలో వైద్యులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి ఆదేశించారు. పట్టణంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రజలకు వైద్య సేవలందించడంపై ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజల సమస్యలను నివృత్తి చేసి, వైద్య సేవలు అందించి వారి మెప్పు పొందాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే వైద్యులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ధర్మవరం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సిల్వియా సాలోమన్, డైరెక్టర్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, డిపిఎంఒ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ శ్రీదేవి, నివేదిత పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు కృషి చేయండి : డిఎంహెచ్ఒ

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లో దోమల ద్వారా ప్రబలే వ్యాధులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిఎంహెచ్ఒ మంజు వాణి తెలిపారు. పట్టణంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గన్యా, తదితర వ్యాధులు, నివారణ పద్ధతులను వివరించారు. దోమల నియంత్రణ, దోమతెరల వాడకం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పాటించాలని ప్రజలకు తెలిపారు. వారానికి ఓ సారి ఇంట్లోని నీటి పాత్రలను శుభ్రం చేసి కొత్తగా నీరు పట్టాలని తద్వారా దోమల లార్వాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ షమీవుల్లా, ఎఎన్ఎం ప్రతిభ, పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



రాష్ట్రస్థాయి బాస్కెట్ పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి పి.భానుతేజ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వాల్మీకి పాఠశాల అధినేత అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భానుతేజ నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటాడన్నారు. భానుతేజ ఎంపిక పట్ల వాల్మీకి స్కూల్ యాజమాన్యం పి.పవన్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్రస్థాయి బాస్కెట్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం రూరల్ : ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే 68వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల జట్లకు ధర్మవరం విద్యార్థులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.కిరణ్మయి, బి.నిఖ్యశ్రీ, ఎం.యశస్విని, బాలుర విభాగంలో ఆర్.లక్ష్మీనరసింహ, ఎం.కార్తీక్‌నాయక్ ఎంపికయ్యారని ధర్మాంభ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రరెడ్డి తెలిపారు. వీరు ఈ నెల 21వ తేదీ అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిడి వి.నాగేంద్ర హర్షం వ్యక్తం చేశారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పి.భానుతేజ

పశుగణనకు సహకరించాలి



లేపాక్షిలో పశుగణన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పరిగి

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సోమనాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పరిగిలో పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ పశుగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది గ్రామంలో పర్యటించి నప్పుడు ప్రతి ఒక్కరూ సహకరించి ఇంట్లో ఉన్న పశువుల వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నారాయణ, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, భయపరెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పశుగణనకు ప్రజలు సహకరించాలని పశువైద్యాధికారి డాక్టర్ గురునాథరెడ్డి కోరారు. స్థానిక పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్ర మాన్ని దాదాపు నాలుగు నెలల పాటు నిర్వహిస్తారన్నారు. సమగ్ర వివరాల నమోదుకు అందరూ సహకరించాలన్నారు. పశుగణన ప్రక్రియ పూర్తయితే చిహ్నంగా ప్రతి ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్ అంటిస్తారన్నారు. ఈ గణన ప్రక్రియ పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడే కార్యక్రమాల రూపకల్పనకు ఉపకరిస్తుందన్నారు.

లేపాక్షి : స్థానిక పశువైద్యశాలలో ఎడి వేణుగోపాల్, వైద్యులు హేమలత పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పశువుల వివరాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా కదిరి సబ్ డివిజన్‌కు సంబంధించి శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వరుసగా రూ. 2,500, రూ. 2,000, రూ. 1,500 చొప్పున కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్ అందజేశారు. అనంతరం కాలేజీ విద్యార్థిలకు సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల నియంత్రణ, ర్యాగింగ్, మత్తు పదార్థాల నిర్మూలన, తదితర విషయా లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ సిఐ డివి.నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్‌జాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని రెండో పట్టణ సిఐ రెడ్డప్ప పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. సిఐ శుక్రవారం పట్టణంలోని జీవానంద, విశ్వభారతి పాఠశాలలకు వెళ్లారు. సిఐ యాజమాన్యంతో మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, అందులో ప్రతిభ చూపిన ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. వారికి పోలీసుల సమక్షంలో అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ రీసర్వే సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మాగే చెరువు పంచాయతీ గ్రామమైన చెన్నాపురంలో శుక్రవారం రీ సర్వే భూ సమస్యలపై సర్పంచి నర్సింహులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన రీ సర్వే తప్పులతడకగా జరిగిందని, దీనిని సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం గ్రామాల వారీగా సభలు నిర్వహిస్తుందన్నారు. గ్రామసభలో మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, విఆర్ఒ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది సౌమ్య, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి గ్రామంలో శుక్రవారం రీసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహిం చారు. ఇందులో జాయింట్ ఎల్‌పిఎం ఉన్న రైతులకు వాటిపై అవగాహన కల్పించారు. సర్వే నెంబర్ కాకుండా ఎల్‌పిఎం నెంబర్ ద్వారా భూమిని ఎలా గుర్తించాలో వివరించారు. అనంతరం రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ యూనస్‌బాబు తెలిపారు.

గాండ్లపెంట : మండలంలోని జీనులకుంట గ్రామంలో శుక్రవారం రీ సర్వే భూ సమస్యలపై గ్రామసభ నిర్వహించినట్లు తహశీల్దార్ బి.బాబురావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూమి సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతులు భూముల సర్వే నెంబర్లు, కొలతల్లో హెచ్చుతగ్గులు ఉంటే అర్జీ ఇచ్చిన వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జాఫర్, సర్వేయర్ జగన్నాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు



గ్రామసభ నిర్వహిస్తున్న తహశీల్దార్ బాబురావు

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-పెనుకొండ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్, సిఐ రాఘవన్

ప్రియుడితో కలిసి భర్తను కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను శుక్రవారం పట్టణంలోని సిఐ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీఎస్పీ మహేష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 22వ తేదీ రొద్దం మండలంలోని ఎల్‌జిబి నగర్, తురకలాపట్నం మధ్యలో ఉన్న ఈత వనంలో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించామన్నారు. అక్కడ లభించిన పెయింట్ కూపన్లు, ఆధారాలతో పోలీసులు హిందూపురంలో ఉంటున్న పెయింటర్ అంజనప్ప వద్దకు వెళ్లి ఆరా తీయగా మృతుడు పరిగి మండలంలోని సిరె గోళం గ్రామానికి చెందిన కురుబ రమేష్‌గా తేలిందన్నారు. రమేష్ పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన మహిళను వివాహమాడాడు. వారి మధ్య మనస్పర్ధలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. తూముకుంట వద్ద ఓ గార్మెంట్ పరిశ్రమలో పని చేస్తూ కేతేపల్లి గ్రామానికి చెందిన చాకలి రాజుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయంపై రమేష్ భార్యతో తరచూ గొడవ పడేవాడు. దీంతో రమేష్‌ను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడు చాకలి రాజు, అతని మేనమామ చాకలి సుబ్బరాయప్పతో కలిసి కుట్ర పన్నారన్నారు. ఆ ప్రకారం ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం రమేష్‌ను సుబ్బరాయప్ప ద్విచక్ర వాహనంపై ఎల్‌జిబి నగర్ వద్ద కల్లు దుకాణం వద్దకు తీసుకొచ్చాడు. అప్పటికే అక్కడ ఉన్న చాకలి రాజుతో కలిసి కల్లు తాగారు. ఆ తర్వాత వారు రమేష్‌ను కత్తితో పొడిచి హత్య చేసి గుర్తు పట్టకుండా పెట్రోల్ తీసి నిప్పు పెట్టి పరారయ్యారు. పోలీసులు నిందితులను సుబ్బరాయప్ప ఇంటి వద్ద అరెస్టు చేశారు. కేసును ఛేదించిన పెనుకొండ సిఐ రాఘవన్, రొద్దం, పరిగి ఎస్ఐలు నరేంద్ర, రంగడు, ఎఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుళ్ల ఆదినారాయణ, నాగరాజు, కానిస్టేబుళ్ల రేణుకాదేవి, దస్తగిరి, జనార్ధన్, ధనుంజయ్, లక్ష్మీకుమార్, గాయత్రిలను ఎస్పీ అభినందించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉమాశంకర్‌రావు కుమారుడు బాలకృష్ణ(24) గురువారం రాత్రి ఇంటిపై నిద్రించాడు. ఉదయం తల్లి మిద్దె పైకి వెళ్లగా బాలకృష్ణ రేకుల కడ్డీకి నూలు తడుతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు జాబిర్ వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వంగపేరులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని ఇరగంపల్లి గ్రామ సమీపంలో ఉన్న వంగపేరులో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ పడి ఓ మహిళ మతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అంకె ఈరమ్మ(62) వంగపేరులో దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడి మునిగిపోయింది. అక్కడే ఉన్న వారు గమనించి ఆమెను బయటకు తీసినా ఫలితం లేకపోయింది. ఈమెకు ఒక కుమారుడు, నలుగురు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ ఇందిర తెలిపారు.

పాముకాటుతో మహిళ...

గుడిబండ : మండలంలోని పిసి గిరి గ్రామానికి చెందిన శివలింగప్ప భార్య నీలమ్మ(50) శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందింది. శివలింగమ్మ అగళి మండలంలోని హల్లికెర గ్రామంలో పత్తి పంట కోయడానికి వెళ్లింది. ఆమె పత్తి పొలంలో ప్రమాదవశాత్తూ పాముకాటుకు గురి కావడంతో వెంటనే రొళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని గొల్లపల్లి బ్రిడ్జి దాటగానే ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఉపేంద్ర, అతని బావమరిది నాగేంద్ర అనంతపురం నుంచి ధర్మవరం పట్టణానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. వారు గొల్లపల్లి బ్రిడ్జి దాటగానే పెట్రోల్ బంకు సమీపంలో వస్తుండగా చిగిచెర్ల వైపు నుంచి ధర్మవరం పట్టణానికి వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ఉపేంద్ర తలకు తీవ్ర గాయం కాగా నాగేంద్ర స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వారిని ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఉపేంద్రను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం డిఆర్ఒ క్రిష్ణకుమారి సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిడిఒ ద్వారా చేసుకున్న దరఖాస్తులను క్రమ పద్ధతిలో పూర్తి చేసి అమ్మకం, కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సేవలన్నింటికీ ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు మాత్రమే వసూలు చేయాలని సూచించారు. మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మైనగానిపల్లి అంగన్వాడీ కేంద్రానికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ వారి సహకారంతో శుక్రవారం 20 చైర్లు, జంకానా, తదితర ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఏసిపి రమేష్‌బాబు, గౌస్‌పీర, చంద్రశేఖర్, మంజన్న, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, అంగన్వాడీ టీచర్ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, పిహెచ్‌సి, జడ్పీ హైస్కూల్, జీనులకుంట, తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను శుక్రవారం జెసిబితో తొలగించినట్లు ఈఓఆర్‌డి సునీత తెలిపారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య చర్యల్లో భాగంగా రోడ్డుకిరువైపులా ముళ్ల పొదలు, వీధుల్లో చెత్త తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాషా, సర్పంచి రహమతుల్లా, పంచాయితీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రజల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని సర్పంచి అంజనమ్మ తెలిపారు. మండల కేంద్రమైన నంబులపూలకుంటలో దీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను ఆలయ కమిటీ సభ్యులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె స్థానిక వైకుంఠ నారాయణస్వామి ఆలయంతో పాటు అయ్యప్పస్వామి గుడి, జగనన్న కాలనీ, జర్నలిస్టుల కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైన్ ఏర్పాటు చేయించారు. అలాగే ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తానని సర్పంచి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని మరవకొత్తపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి మలేరియా, డెంగీ, ఫైలేరియా, తదితర వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ నరేష్, ఆశా కార్యకర్త ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.